పరిచితా పరంజ్యోతి

# ధీర



పొందికగా, చక్కగా, అందంగా, ఆకర్షనీయంగా, నిండుగా కనిపించే ఆ ఇంటి పేరు 'పంచవటి.' అందులో ఇల్లు గలవాళ్ళతో పాటు అయిదు కుటుంబాలు కాపురం ఉంటున్నాయి. అందులో ఉన్న వాళ్ళంతా ఏక కుటుంబీకుల్లా ఉంటారు. వరుసలతో పిల్చుకుంటారు. అద్దె వాళ్ళు అప్పుడప్పుడూ మారుతూ ఉన్నా కొత్త వాళ్ళు మళ్ళీ అందరితో కలిసిపోతూ ఉంటారు. అద్దె పెంచాల్సి వచ్చినప్పుడు, అద్దెకున్నవాళ్ళు పెంచాల్సిందే. ఇల్లుగల వాళ్ళు పెంచమని అడగరు. ఈ ఇంటికున్న ప్రత్యేకత ఎవరిదో ఏమిటో ఎందుకో గాని... ఇలాగే సాగిపోతూ ఉంది.

నేను ఈ ఇంటికి వచ్చి పదిహేను సంవత్సరాలైంది. నేను వచ్చిన అయిదు ఏళ్ళకి కాబోలు ధీర వచ్చింది. ఇరవై రెండు, ఇరవైం మూడు ఏళ్ళు ఉంటుందేమో, కాని మనిషి ఇంకా లేతగా కనిపిస్తుంది.

ధీరని చూస్తే బాగా చదువు, సంస్కారం ఉన్న మనిషి.గా, కలవాళ్ళ బిడ్డలా కనిపిస్తుంది. ఆమెతో మాట్లాడుతున్నప్పుడు 'మనిషి ఎంత మంచిది' అనిపిస్తుంది. కాని ఎప్పుడు చూసినా ఏదో పోగొట్టుకున్నట్టు, బాధలో ముంచి తీసినట్లు, కొన్నిసార్లు శోకమూర్తిలా కనిపించేది. ఒంటరిగానే వచ్చింది. ఒంటరిగానే ఉండసాగింది.

బాంకులో ఉద్యోగం అట. ఉదయం అనగా వెళ్ళి సాయంకాలం తిరిగి వచ్చేది. ఓ కుటుంబం ఉండగలిగేంత ఇంట్లో అమ్మాయి ఒక్కర్తి ఉండటం బాగా అనిపించేది కాదు. ఓ రోజు నేనే

అడిగాను. "ధీరా ! నువ్వు ఒంటరిగా ఉంటావా అమ్మా?" అని.

"లేదు, పిన్నిగారూ ! రేపో ఎల్లుండో వంటమనిషి వస్తుంది" అంది.

అన్నట్టుగానే రెండు రోజులకు వంటమనిషి లచ్చక్క వచ్చింది. ధీర ఆఫీసుకు వెళ్ళాక లచ్చక్కతో బాతాఖానీ పెట్టుకుంటే ధీర తల్లితండ్రుల గురించీ, వాళ్ళ వంశం గురించీ, ఐశ్వర్యం గురించీ, ధీర అందచందాలు, చదువు, ధైర్యసాహసాల గురించి కథలు కథలుగా చెప్పింది కాని, పంచవటి వాళ్ళు అంతా ధీర గురించి ఏం తెలుసుకోవాలని అనుకుంటున్నారో దాని గురించి ఒక్క మాటా చెప్పేది కాదు. ఇంకా వివరంగా అడగటం మాకు నచ్చక ఊరుకున్నాము.

ఓ రోజు మధ్య రాత్రిలో ఏదో వస్తువులు ఎత్తి పారేస్తున్న చప్పుళ్ళు, దెబ్బలు కొడుతున్న చప్పుడు, ఏడుపు వినిపించగానే, పంచవటిలోని అన్ని ఇళ్ళలో లైట్లు వెలిగాయి. వెంటనే ఆ చప్పుళ్ళన్నీ ఆగిపోయాయి. ఇంట్లో నుంచి ఓ ఆకారం తొందర తొందరగా బయటకు వెళ్ళిపోవడం కనిపించింది.

తెల్లవారి ధీర ఆఫీసుకి వెళ్తున్నప్పుడు, ఎటువైపూ చూడకుండా బిరబిరా నడుచుకుంటూ వెళ్ళిపోయింది. లచ్చక్కను రాత్రి సంఘటన గురించి అడిగితే-

"ఔనండీ, మా ఇంట్లోనే చప్పుడు. వచ్చినాయన మా ధీరమ్మగారి భర్త. అప్పట్లో ఎవరు చెప్పినా వినలేదు. అతన్నే కావాలని చేసుకున్నది. బిడ్డ పూర్వజన్మలో ఏం పాపం చేసుకుందో ! ఈ జన్మలో అనుభవిస్తోంది. బంగారం లాటి బిడ్డ వచ్చని బతుకులో నిప్పులు పోసుకుంది" అని కళ్ళు వత్తుకుంది.

"మరి తల్లి, తండ్రి, అన్న తమ్ముళ్ళు..."

"ఏం చేస్తారమ్మా వాళ్ళు మాత్రం ! వాళ్ళ చేతుల్లో ఏమైనా ఉన్నప్పుడు చెప్తే అమ్మాయి వినలేదు. ఇప్పుడు వాళ్ళు ఏం చెయ్యగలరూ? అక్కడా ఇదే తంతు..."

"ఏమైనా తన వాళ్ళు తోడుగా ఉంటే అ దో ధైర్యం."

"ధీరమ్మకి మూడు, నాలుగు నెలల పసికందు. ఆ పుణ్యాత్ముడు పాలు తాగే పసికందుని లాక్కుపోయాడు. మగ ప్రాణం, భార్య గుర్తుకు వచ్చి ఇక్కడకు రాకపోతాడా, వచ్చినప్పుడు - తన పాపని తిరిగి అడిగి తీసుకుందామని ఈ బిడ్డ తాపత్రయం. పైగా ఈ ఊర్లో ఉద్యోగం ఒక్కటి. అందుకే ఈ వనవాసం" అంది.

"పాపం !" అన్నాను.

వెంటనే లచ్చక్క "అమ్మా ! మా అమ్మాయి ఎన్నయినా సహిస్తుంది కాని, ఈ మాటని సహించదు. జీవితం అన్నాక ఇట్లాటివన్నీ గూడా ఉంటాయి అంటుంది" అంది లచ్చక్క.

ఇంకోసారి ధీర, లచ్చక్క పండుగప్పుడు ఊరు వెళ్ళినప్పుడు... అర్ధరాత్రి సమయంలోనే ఒకటి, రెండు నగలు, నగదు, గుడ్డలు... చిన్న చిన్న వస్తువులు అన్నీ దొంగిలించబడ్డాయి. తలుపులకున్న తాళాలు కోసివేశారు. పోలీసు రిపోర్ట్ ఇవ్వడానికి వెళ్తుంటే- " పిన్నిగారూ ! ఇంకోసారి ఇలా జరగకుండా నేను చూస్తాను. ఈసారికి వదిలేయండి" అంది

"ఈ రోజు మీ ఇంట్లో జరిగింది. రేపు మా ఇంట్లో జరగొచ్చు. ఇట్లాటివి ఇక్కడ జరగడానికి వీలులేదమ్మాయి... నీకు కష్టంగా ఉంటే నువ్వు ఇల్లు ఖాళీ చేయి" అంది ఇల్లుగలావిడ.

ధీర మౌనంగా ఊరుకుంది. ఆ తరువాత అట్లాటివి మళ్ళీ ఏం జరుగలేదు.

ప్రతి ఉగాదినాడు ధీర తన దగ్గర నాలుగు నెలలున్న తన కూతురు గురించి, చెప్పిన మాటలే మళ్ళీ మళ్ళీ చెప్పేది. పాప ఉగాదినాడే పుట్టిందట. ఆ నాలుగు నెలల అనుభూతులే మిగిలిపోవటంవల్ల ఆ రోజు అసాధారణంగా ఉండేది.

పాపని తన దగ్గరకు తెచ్చుకునే ప్రయత్నాలు ఏవీ ధీరకు ఫలించలేదు. కోర్టు దాకా వెళ్తే విడాకులు దొరికాయి కాని, పాపాయి దొరకలేదు.

గడిచిపోవటమే తెలిసిన కాలానికి ఎవరితో నిమిత్తం ఉంటుందని ! బాగానే రోజులు గడిచిపోయాయి.

లచ్చక్కకు వృద్ధాప్యమే ఆనారోగ్యమై, ఓ రోజు ధీరని విడిచి - తన ఇంటికి వెళ్ళిపోతూ - "నా బంగారు తల్లీ ! నిన్ను ఈశ్వరుడే కాపాడుతాడు" అని దీవించింది.

"నువ్వు మళ్ళీ ఒంటరిదానివైపోయావు" అన్నప్పుడు 'తనకి ఇలాగే ఉండటం అలవాటైపోయిందని, అయినా ఈ 'పంచవటి'లో ఉన్నవాళ్ళు చుట్టుపక్కల వాళ్ళు, బాధితులు, వృద్ధులు, పసివాళ్ళు వీళ్ళంతా తన వాళ్ళే' అంది.

అలాగే ఎవరికి ఎప్పుడు ఏ సహాయం అవసరం అయినా రాత్రి పగలనక, తన వయసుతో అవతలి వాళ్ళ వయసుతో నిమిత్తం లేకుండా పనులు చేసిపెట్టేది. ఎవరి ఆలోచనలతో, అనుమానాలతో, మాటలతో ధీరకి నిమిత్తం ఉండేది కాదు. పన్నెండు గంటల రాత్రిపూటైనా ధీర ఒంటరిగా బయటకు వెళ్ళగలిగేది. మా అందరిలా ఆమెకు భయాలు ఉండేవి కావు.

అప్పుడప్పుడు తన కూతురు గురించి చెప్పేది. కూతురు బడికి వెళ్తోందని, అయిదవ క్లాసు - పదవ క్లాసు అని, దానికి ఏదో అనారోగ్యం చేసిందని... బాగైందని, కాలేజీకి వెళ్తోందని, పెద్దమనిషైందని చెప్పేది. ఓసారి తన కూతురికి తనపై మంచి అభిప్రాయం లేదు అని నవ్వింది కాని ఆమె రెండు కళ్ళు తడిసిపోవటం అందరికీ కనిపించింది.

"నీ కూతురుకు నీ గురించి ఎందుకు చెప్పవు ధీర?" అంటే - "నా మాటలు నమ్ముతుందా? అయినా నా గురించి చెప్పాలంటే తండ్రి చెడ్డతనం గురించి చెప్పాలి. తండ్రి దగ్గర ఉంటున్నదానికి ఆ నీడ గూడా కరవవుతుంది" అనేది. ఇంతకాలం గడచినా ఉగాదినాడు మాత్రం కూతురు గురించి చెప్పటం ఆగిపోలేదు.

ధీరకి నలభై ఏళ్ళు వచ్చాయి. వయసువల్ల వచ్చిన నిండుతనం, తనలోని మంచితనం వల్ల వచ్చిన కాంతి ధీర ముఖంలో స్పష్టం కాసాగాయి. క్రమంగా అందరికీ ఆమె పట్ల గౌరవం, ఆత్మీయత బాగా పెరిగిపోయాయి.

ఆ రోజు ఉగాది. అందరం పండుగ పనుల్లో పూర్తిగా లీనం అయిపోయి ఉన్నాము. ఉన్నట్టుండి "బాబాయ్, పిన్నీ వదినా, లీలా, నానీ, మాధవీ" పంచవటిలో వాళ్ళ పేర్లన్నీ ఒక్కొక్కటి వినిపిస్తూ ఒక్కొక్కరితో "నా కూతురు వచ్చిందిరా !" అన్న ధీర కంఠం వినిపించి ఉన్నపళంగా అందరం బయటికి వచ్చాం. సంతోషంతో పిచ్చిదానిలా ఊగిపోతూంది ధీర. ఆమె కౌగిట్లో ఇరవై ఏళ్ళ క్రితంనాటి 'ధీర రూపం.' కూతురిని పలు పలు విధాల ముద్దుపెట్టుకుంటూ మురిసిపోతోంది. పొంగిపోతూంది ధీర.

చుట్టుపక్కల వాళ్ళతో - దారిన పోయేవాళ్ళతో గూడా చెప్తోంది - ఈ అమ్మాయి తన కూతురు అని... "ధీర ఎంత చక్కగా కష్టాలని ఎదుర్కోగలిగింది. తాను జీవించింది. ఎందరికో ఉపకారం చేసింది. చివరకు తనకు కావాల్సింది పొందగలిగింది. మరి మిగతా స్త్రీలు ఇలా జీవితాన్ని ఎందుకు ఎదుర్కోరో ! ఉరిపోసుకునో, కాల్చుకునో, నీళ్ళలో పడో, నిద్రమాత్రలు మింగో చచ్చిపోతా రెందుకూ?"

పంచవటిలోని బామ్మ అన్నారు. "మీ అమ్మని చూస్తే నీ కేమనిపిస్తోంది?" పంచవటిలోని వాళ్ళం ధీర కూతురిని అడిగితే, ఆ అమ్మాయి తల్లిని గట్టిగా కౌగలించుకుని ముద్దు పెట్టుకుంటూ "గర్వంగా" అంది. తళతళమని మెరుస్తోన్న పళ్ళని బయట పెట్టి, మిల మిల మెరుస్తోన్న కళ్ళతో నవ్వుతూ.

